**AKSHARASURYA**
Peer-Reviewed, Multi Lingual E-Journal
Volume – 02, Issue – 01, January 2023.

# తెలంగాణ కవిత్వ పీఠికలు – అస్తిత్వ సంఘర్షణలు

– ఐనాల భరత్
యూ.జి.సి సీనియర్ రీసెర్చ్ ఫెలో
తెలుగు శాఖ, స్కూల్ అఫ్ హ్యూమానిటీస్
యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్–500046
మొబైల్ నెం.
9640266152
Email: inalabharathkumar@gmail.com

## పత్రసారాంశం

*ప్రాచీన కావ్యఅవతారికల స్థానంలో ఆధునికకాలంలో పీఠిక వచ్చాయి. గ్రంథంలోని గుణదోషాలను, పీఠిక పొందుపరుస్తుంది. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగుసాహిత్యంలోకి ప్రవేశించిన పీఠిక, ఓ ప్రక్రియగా గుర్తింపు పొందడమే కాక విమర్శను విస్తరించిది. తెలంగాణ సాహిత్య ప్రక్రియలన్నింటికి పీఠికలు ఉన్నాయి. ఈ పీఠికలు తెలంగాణ కవిత్వానికి చాలా గొప్ప పునాదిని వేసాయి. తెలంగాణ అస్తిత్వ ఉద్యమంలో కవిత్వం అధికంగా వచ్చింది. ఆ కవిత్వానికి మార్గనిర్దేశం చేసింది పీఠికలే. తెలంగాణ మలివిడత ఉద్యమ కవిత్వాన్ని పీఠిక గొప్పగా ప్రచారం చేసింది. రచనలోని చెప్పలేని విషయాలను పీఠికలలో చెప్పుకోడానికి కూడా కవులే స్వీయ పీఠికలు రాశారు. ఇవన్ని తెలంగాణ సమాజాన్ని ప్రజలను చైతన్యపరిచాయి. ఈ విషయాలన్నీ ఈ వ్యాసంలో సోదాహరణంగా నిరూపించాను.*

(*కీపాయింట్స్:* తెలంగాణ కవిత్వం, పీఠికలు, తెలంగాణ సాహిత్య విమర్శ, ఐనాల భరత్)

### పరిచయం:

సాహిత్యానికి ఎల్లలులేవు. మంచి విషయంతో కూడిన సాహిత్యం ఏ భాషాలో వచ్చినప్పటికీ అనతికాలంలోనే మరో భాషలోకి అనువాదం, అనుసృజన జరుగుతున్న సందర్భాలు ఆధునికకాలంలో చూస్తున్నాం. విశ్వవ్యాప్తమయిన సాహిత్యంలో కూడా ప్రాంతీయ వ్యత్యాసాలు, మాండలిక భేదాలు, విషయం,భావం,అవగాహన మొదలైన అంశాలను ప్రాతిపదికగా చేసుకొని నూతన ఒరవడి కొనసాగిస్తున్నా అనేక సాహిత్య ప్రక్రియలు వచ్చి చేరడం వలన సాహిత్యం విస్తృతి చెందింది. అనేక ప్రక్రియలను తనలో పొదువుకొనిసాహిత్య పరధి కూడా అంతకంతకు విస్తరించిది. అలా విస్తరించి ప్రక్రియ పరంగా తనకంటూ ప్రత్యేక స్థానం కల్గిన ఆధునిక సాహిత్యంలో విశేషంగా రాయబడుతున్న పక్రియ 'పీఠిక. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోనికి వచ్చింది. రచనలోనిగుణదోషవిచారణ చేసి,రచన పూర్వరంగాన్ని సిద్ధపరచడంలో పీఠిక ప్రధాన పాత్ర పోషిస్తుంది. పీఠికకు 'ముందుమాట, తొలిపలుకు, మున్నడి, భూమిక,అముఖం వంటి పేర్లున్నాయి.

పాశ్చాత్యసాహిత్య ప్రభావం మూలంగా "పీఠిక" అనే ప్రక్రియ వెలుగులోకి వచ్చింది. ఇతర ప్రక్రియల్లాగానే అనగా కథ, నవల, నాటకం, వంటి ప్రక్రియల్లాగా పీఠికా ప్రక్రియ కూడా ముద్రణాయంత్రాలు ప్రారంభమైన నాటినుండీ ప్రచారంలోకి వచ్చి, నేటి ఆధునిక యుగంలో అది ఒక ప్రక్రియగా నిలదొక్కుకుంది. పీఠిక విమర్శరంగంలో ఒక భాగంగా ఉంటూ విమర్శను విస్తృతం చెస్తుంది. ప్రాచీన కాలంలో కావ్యావతారికల స్థానంలో ఆధునిక యుగంలో పీఠికలు వచ్చాయి.

సాహిత్యానికి సంబంధించిన దాదాపు అన్ని ప్రక్రియలను పరిచయం చేస్తూ పీఠికలు రాయడం జరిగిందనిచెప్పవచ్చు.ప్రతి రచన లేదా సాహిత్య అంశం గురించి సూటిగా స్పష్టంగా దాని లోతును "కొండను అద్దమందు"చూపినట్లుగా, చూపడానికి పీఠికనురూపొందించినారు. *“పీఠిక అంటే గ్రంధానికి మొదట రాసే సమాచారంగా చెప్పవచ్చు.గ్రంథం మొదట్లో వ్రాసే ఆ గ్రంధానికి సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలు తెలిపే రచన”. పీఠిక ఉన్నత ప్రదేశం కాబట్టి దానిని అధిష్టించినవారికి క్రింది వస్తువులు స్పష్టంగా గోచరిస్తాయి అలాగే గ్రంధపీఠికగాని భూమిక గాని చదివిన వారికి గ్రంథంలో ఉన్న విషయం గోచరిస్తుంది.*(తెలుగుసాహిత్యకోశం;ప్రాచీన సాహిత్యం.పుట.746) అని తెలుగు సాహిత్య కోశం పీఠిక ను నిర్వచించింది.

ప్రాచీన కాలంలో కావ్యాలకు ఉన్న అవతారికలు, నాటకాలకు ఉన్న నాందీ ప్రస్తావనలు, ఎలాగో సాహిత్య రచనలకు పీఠికలు ఇదే విధంగా ఉన్నాయి. ఆధునిక సాహిత్యంలో అన్ని ప్రక్రియలకు విశేష రచనలకుపీఠికలు ఉన్నాయి. గ్రంథప్రచురణ ప్రారంభమైన తర్వాత పీఠిక రచన చాలా విస్తృతమైంది.ఈ పీఠిక రచన ఎంతగా వృద్ధి పొందిందంటే సాహిత్య చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన పీఠికలు వచ్చాయి. పీఠిక రచన, గ్రంథవిమర్శను శైలిగా మార్చుకున్న రచయితలు కోకొల్లలు.పీఠిక ఆధారంగా గొప్ప రచనలుగా నిలదొక్కుకున్న రచనలు ఉన్నాయి. గ్రంధాలు ఎంత గొప్ప పేరు ప్రఖ్యాతి పొందాయో పీఠిక కూడా అంత పేరుపొందిన సంఘటనలు సందర్భాలు అనేకం ఉన్నాయి.విమర్శ రంగాన్ని పీఠిక విశాలంచేస్తే, పీఠిక స్థాయిని“విమర్శ”పెంచి పెద్ద చేసింది.

**తెలంగాణ కవిత్వం–స్వభావం**

తెలంగాణకవిత్వంఅనగానే ఉద్యమకవిత్వమే అనే ఆలోచన కల్గుతుంది. అధికభాగం ఉద్యమ కవిత్వం ఉన్నప్పటికి అన్నివాదాలను, సమాజంలో ఉన్న సమస్యల పట్ల స్పందించి రాసిన కవిత్వం కూడా వచ్చింది. తొలిదశ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం చేసిన ప్రయత్నంలో సామాన్యులను, చైతన్యపరచడంలో సాహిత్యం పాత్ర తిరుగులేనిది. నాటి విద్యార్థుల ద్వారా 1969 ఉద్యమానికి మద్దతు తెలుపుతూ ఇబ్బడిముబ్బడిగా సాహిత్యం అనేక ప్రక్రియలలో ఆవిష్కరించారు. సరైన నాయకత్వం లేక ఎవరి స్వార్థ ప్రయోజనాలు వారు చూసుకోవడం వల్ల ఉద్యమం నీరుగారిపోయింది.ఈ విధానాలనువారి రెండునాల్కల ధోరణిని కవిత్వంలో ఎండగడుతు రచనలు వచ్చాయి. మలి దశ తెలంగాణ ఉద్యమంలో గతంలో తగిలిన ఎదురుదెబ్బల వలన గుణపాఠం నేర్చుకొని, నాయకులను నమ్ము కోకుండా ప్రజలే క్రియాశీలక శక్తులుగా మారి ఉద్యమ ఆకాంక్షలను ప్రతిభింబించారు. ప్రాంతీయ స్పృహతో ఆ ప్రాంతంలోఉన్న

సమస్యలను, అసమానతలను, అన్యాయాలనునిరసిస్తూ, లేదా ఖండిస్తూ వచ్చిన సాహిత్యం, ప్రాంతీయసాహిత్యం. ఈసాహిత్యంలో ఆ ప్రాంతానికే పరిమితంగా ఉన్నటువంటి సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, అన్ని ఇందులో మిళితం అవుతాయి. *“కేవలం భాష పేరుమీద ఐక్యమైన ఇరుప్రాంతాలకు ఒకే కొలబద్దలుపనికిరావు. కోస్తా తెలంగాణల మధ్య సాంస్కృతిక, సామాజిక, చారిత్రక వైరుధ్యాలు ఉన్నాయి. ఆధునికతను అన్ని రకాలుగా సంతరించుకున్న కోస్తా సాహిత్యకారులకు కేరీరిజంలో పైమెట్టు అధిరోహించడానికి సాహిత్యం పనికి వస్తుంటే, తెలంగాణ సాహిత్యకారులకు తమనుతాము వ్యక్తీకరించుకునే సాధనం మాత్రమే. విప్లవ సాహిత్యం ఎక్కడ కేరీరిజానికి అడ్డంకిగా మారిందో, అక్కడ కోస్తా సాహిత్యకారులు ప్రశ్నలు సంధించారు. వీటిని సహేతుకమైన ప్రశ్నలు కావని అనలేం, అది వేరే విషయం.*

*“కోస్తాంధ్రులకు జీవితంలో పైమెట్టు అధిరోహించడానికి దళితస్త్రీవాదాలు సాధనాలుగా మారాయి. ఇవ్వాళసాహిత్యాన్ని వీరు వాడుకుంటున్న తీరును అంటే వారి ఆచరణను చూస్తే ఈ విషయం అర్థమైపోతుంది. దీన్ని పక్కన పెడితే రెండు ప్రాంతాల సాహిత్యాలను ఒకే కొలబద్దతో కొలవడం సమంజసం కదాని గుర్తించాల్సిన అవసరం వుంది. అంతేకాదు, దళిత స్త్రీవాదులు స్థానిక ఉనికినిచాటే రచనలు చేయడం అవసరం. ప్రత్యేక తెలంగాణవాదాన్ని అంగీకరించి అందుకు అనుగుణమైన రచనలు చేయడమే తెలంగాణా రచనలు చేయడంకాదు. తమ సాంస్కృతికమూలాలను*

*వ్యక్తీకరించే రచనలు చేయడంకూడా తెలంగాణ రచనలు చేయడమే. ఈ విషయాన్ని తెలంగాణ రచయితలు గుర్తించడం అవసరం'అని కాసుల ప్రతాపరెడ్డి విడమరచి చెప్పే ప్రయత్నం చేశారు. ఒకటి రెండు మినహాయింపులతో కాసుల ప్రతాపరెడ్డి అభిప్రాయాల్ని అంగీకరించవచ్చుఅని గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి అభిప్రాయపడ్డారు."*(యాకూబ్,తెలంగాణ సాహిత్య విమర్శ, పుట.18)

పై అభిప్రాయాలను బట్టి తెలంగాణ సాహిత్యంలోని ప్రక్రియల మీద విశేషమైన కృషి చేస్తే వారి ఉద్యోగ జీవితానికి లాభం లేకపోగా విప్లవ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారన్న నెపంతో వారి వ్యక్తిగత జీవితానికి భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. కావున రచనలు చేసి తమ వాదాన్ని బలంగా వినిపించాలని ఉన్న చేయలేని పరిస్థితి, దుస్థితి తెలంగాణ ప్రాంతంలోనే ఈ సాహితీకారుల విషయంలో జరిగింది అని వాపోయారు.

అంతేగాక కష్టంగురించి కన్నీళ్ళ గురించి రాయాలంటే వాళ్ళ జీవితాల తాలూకు అదే దృక్పథాల నుండి వచ్చిన దళితులు, స్త్రీలు వారి జీవితాన్ని చూసిన పరిస్థితులు అన్ని లోతుగా విశ్లేషించగలరు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకోని తర్వాత కాలంలో స్థానికత, గురించి, తెలంగాణవాదాన్ని సమర్థిస్తూ కవిత్వం రాసి పేరుగడించిన బుద్ధిజీవులు అనేక మంది ఉన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వైరుధ్యాల గురించి, వలసవాదుల ఆధిపత్యధోరణిని ఖండించే ఉద్దేశ్యంతో సాహిత్యాన్ని వాహికగా చేసుకొని, నవలలు, నాటకాలు, కథలు,కవిత్వం, నానీలు, దీర్ఘకవితలు, ఇలా అనేక ప్రక్రియలను ఆశ్రయించి, సంపద్వంతమైన సాహిత్యసృజనగావించారు. కొన్ని వ్యాసాలు, పరిశోధనగ్రంథాలు, ఈ ప్రాంతంలోపుట్టి నాయకులుగా, మేధావులుగా ఎదిగిన మహనీయుల జీవితచరిత్రలు, ఆత్మకథలు, స్వీయ రచనలు, ఇలా అనేకం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని నిలిపేప్రయత్నం చేశాయి.

మిగతా సాహిత్యప్రక్రియలతో పోల్చినప్పుడు, కవిత్వం ఈ ప్రాంతంనుండి అధికంగా వచ్చింది. అనేక పార్శ్వాలను తాకింది. భాషపరంగా, శైలిపరంగా, వస్తువు పరంగా తెలంగాణలో ఉన్న కవితావైవిధ్యం చాలా బలమైన పునాది వేసింది. *"ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద వ్యతిరేకభావజాలం అడుగుజాడలనుంచి తెలంగాణ ప్రాంతీయ చైతన్యం అస్తిత్వవేదనావాదంగా నిలదొక్కుకుంది."*(ముదిగంటి, సుజాతరెడ్డి, "ముద్దెర": పుట: 13)అని సుజాతరెడ్డిగారు పేర్కొన్నారు.

ప్రాంతీయ చైతన్య స్పృహతో వచ్చిన సాహిత్యంలో ప్రక్రియ ఏదైనా వేదనను అక్షరబద్ధం చేయడం, పంచుకోవటం, వాటి నుండి బయట పడటానికి చిరకాల దుఃఖానికి అంతం పలకడానికి సమయత్తం కావలనే ఆకాంక్ష కన్పిస్తుంది. నైజం నవాబుల ఏలుబడిలో అన్నిరంగాలలో ఎంతోకొంత మార్పు కనిపించిన, మనుషులకు విలువలేదు, ఎదురుతిరిగితే అణిచివేత, మాట్లాడితే మరణమే అన్న రీతిలో కాశీంరజ్వీ రజాకార్ల సైన్యం ప్రజల మాన, ప్రాణాలు హరించింది. కాకతీయులరాచరికం, రెడ్డిరాజులు, వెలమదొరల పాలనా చరిత్ర కాలగర్భంలో కలసి పాయింది. తెలంగాణ ప్రాంతానికే కానిరోజులు వచ్చాయి. వీరత్వం, శూరత్వం, పోరాట పటిమ వాళ్ళతోనే పోయాయి, నాగరిక మానవుడు, నిర్భయాన్ని కోల్పోయి, నిలువెల్లా నీరై పోయి పరాయి పాలకుల పంచన చేరుకున్న, అన్ని దోచుకున్న చూస్తుండి పోయిన దుస్థితికి దిగజారి పోయిన జాతిలో జవసత్వాలు నింపడానికి, గతం పురావైభావాన్ని గుర్తుచేయడం కూడా కవితాపాదాలలో కనిపిస్తుంది.

గతంలో రాజులు,రాజ్యాలు ఏలిన కాలంలో ఉన్న శౌర్య పరాక్రమాలు ఏమైపోయాయో, వెన్నుచూపని ధైర్యాన్ని, శత్రువును కూడా శరణు అంటే కాచుకోన్న మానవత ధర్మముఎలా మంట గలిసిందో అని తెలంగాణ కవి అణువణువున ఆవేదన చెందాడు.*" ఎప్పుడైనా ఒక వర్తమాన ప్రజాసంచలనం గతాన్ని అన్వేషిస్తుంది. చరిత్రను తవ్విపోస్తుంది. పురాస్మృతిలో ఎక్కడయినా తనకు సారూప్యతలు కనబడతాయా అని వెతుకుతుంది. తాను సగర్వంగా వారసత్వం*

*వహించగలిగిన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నానో, ఎంతటి మహత్తర చరిత్రకు వారాసురాలినో చెప్పుకోవడానికి అది చాలా అవసరం." అని విమర్శకుల అభిప్రాయం.* (ఎన్, వేణుగోపాల్,ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర ముందుమాట: పుట; 01)ఈ విధంగా గతంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఓ ఘనమైన చరిత్రకు ఆనవాలుగా నిలచిన ఈ ప్రాంత పురాస్మృతిని తలచుకొని వర్తమానాన్ని నిలుపుకొనే ఆలోచన అందరికి కలగచేయడానికి కవి తన కలానికి పదును పెడుతున్నాడు. ప్రజసమూహాలను కదిలిస్తూ తట్టి లేపుతున్నాడు. గతం,వర్తమానంరెండింటిలో సమస్యల జడిలో తడుస్తున్న తెలంగాణ జనులకు భవిష్యత్తు బంగారుమయం అవుతుంది అనే భరోసా కవులంతా వారి రచనలద్వారా కల్గించారు.

ప్రాంతీయ స్పృహ–భాషాభిమానం:

*"మనిషికి జ్ఞాపకం ఒక వరం. ఒక శాపం కూడానేమో. గతం నిరంతరం వర్తమానంతో సంభాషిస్తూ ఉంటుంది. ఆనందాలను, విషాదాలనూ గుర్తు చేస్తూ ఉంటుంది. అప్పటి ఘటనలతో, అప్పటి స్థితితో పోల్చి చూపుతు ఉంటుంది."*(ఎన్, వేణుగోపాల్ "సందుక: పుట;xii) అనేక వంచనలతో, ఆంధ్రప్రదేశ్గా ఏర్పాడ్డాక, చేసుకున్న ఒప్పందాలు, రాసుకున్న అగ్రిమెంట్లు అన్ని నిర్వీర్యం చేసి అన్నింటా ఆధిపత్య సంస్కృతిని తెలంగాణ ప్రాంతం మీద ప్రజల మీద రుద్దినప్పుడు మనసు ఆక్రోశించి కవిత్వంగా రూపుకట్టింది. నాటి పాలకుల పుణ్యమా అని కృష్ణ, గోదావరి నదులు తలాపునే పారుతున్న ఇక్కడ మాత్రం సాగునీరు, తాగునీరు లేని దుస్థితి. అధిక రివెన్యూ వచ్చేది ఈ ప్రాంతం నుండి ఈ నిధులు వినియోగించేది ఆంధ్రప్రాంతంలో, ఇలా చెప్పుకుంటూ పోతే ప్రపంచీకరణ, సగం దోచి, ముంచేస్తే, ప్రాంతీయ అసమానతలను, విధ్వంసాన్ని, వనరుల దోపిడీ చేసి, సవతి ప్రేమ చూపించి పూర్తిగా ముంచేసారు. అటువంటి విషాదాలు తలచుకొని నిలువెల్లా రగిలిపోయారు. కవితాగ్రహాన్ని ప్రదర్శించారు. అటువంటి ఆగ్రహాన్ని రగిలించే కవిత్వాన్ని సేకరించి,సంకలనాలు వెలువరించారు. ఒకే కవి అనేక సందర్భాలలో, ఉద్యమాలకు ప్రతిస్పందనగా ప్రజలు ఎలా ముందుకు కదిలినారు, ఎలా సంఘటితం అయ్యారు, వంటి విషయాలను తనలోపలి సంఘర్షణలను సంపుటాల రూపంలో ప్రకటించారు.

దీనివల్ల మారుమూలలనున్న పల్లె ప్రజలు మాట్లాడే యాస భాషలకు సాహిత్యంలో స్థానం కల్పించడమేకాక ఆ అచ్చమైన మాండలిక పదాలను కవిత్వంగా రికార్డు చేయడం, తెలంగాణ భాష సౌష్టవాన్ని ఉన్నతీకరించాడం జరిగిందని చెప్పవచ్చు. ఈ విషయాన్నీ పీఠికాకర్త ఇలా ఆవిష్కరించారు.ఈ ప్రాంత కవులు తమదైన జీవితాన్ని తమదైన సొంత భాషలో రాయాలన్న ఎరుక కల్గి ఉన్నారు. అందుకే చాలా కవితలలో మాండలిక సొబగు యాసలోని మృదుత్వం కొట్టవచ్చినట్టు కన్పిస్తుంది. ఒట్టిగ, ఆగంకావడం, కద్దు, ఇమ్మతి, ఒర్లుడు, లొల్లి, కద్దు, వంటి పదాలను ఈ ఉద్దేశ్యంతోనే కవితాపాదాలలో చెక్కుతున్నారు. తెచ్చిపెట్టినట్టు, అతికించినట్టు కాకుండా పదానికి అర్థగౌరవం కలిగేలా వినియోగించడం ప్రాంతీయ స్పృహా పెరుగుతున్నదానికి, భాషాభిమానంఉన్నదనడానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

*"ప్రాంతం, భావజాలం,రాజ్యం మూకుమ్మడిగా జన జీవనాన్ని అతలాకుతలం చేస్తున్న వేళ అట్టడుగు వర్గాల భాషాసంస్కృతులను తరతరాలుగా దొంగదెబ్బ తీస్తున్నసమయం. ముందెప్పుడు లేనంత వెనుకబడ్డ కులాల మూలల కదలికలను వేనోళ్ళగా కవిత్వంలోకథల్లో నమోదు చేస్తుంటే, E.C.G. తీస్తుంటే తతిమ్మ కులాల వారి కళ్ళల్లో కనిపించని చింతనిప్పులు పోసుకుంటున్నయాల్ల. ఎత్తుల్ని, తోత్తుల్ని జిత్తుల్ని, పోత్తుల్ని, అదే రణనీతితో వివిధ సాహిత్య నిర్మాణ ప్రక్రియల్లో చిత్తు చేసి నిటారుగా తలెత్తుకుంటున్న పొద్దు."* (అన్నవరం దేవందర్ "మంకమ్మ తోట లేబర్ అడ్డా" పుట; iii. దస్తావేజు అనే పేరుతో రాసిన ముందుమాట) అని జూకంటి జగన్నాధం వైవిధ్యమైన పీఠికను అందించారు. దీనికి ఆయన పెట్టిన పేరు 'దస్తావేజు' అని దేవందర్ కవిత్వాన్ని చాలా విశ్లేషణ పూర్వకంగా రాశారు.

తన గత సంపుటాలను యాది చేశారు. ఆంధ్రప్రాంతం వారు, తెలంగాణ వారిని అన్ని వైపులా అతలాకుతలం చేశారని చెప్తూ భాషను సంస్కృతిని కూడా ఏళ్ల తరబడి ఎలా నాశనం చేశారో, దొంగ దెబ్బ తిశారో గుర్తించడం తెలంగాణ పౌర సమాజం బాధ్యత. ప్రజలను జాగరూకతతో హెచ్చరిస్తూ సాహిత్యం ద్వారానే వారిని చైతన్యపరచి, వారి కుట్రలను కుయుక్తులను తిప్పికొట్టాలని ఆకాంక్షించారు. యుద్ధతంత్రాలు వలె సాహిత్యాన్ని ఆధునిక నిర్మాణ పద్ధతులతో సృష్టిచేసి

కొత్త జ్ఞానయుద్ధం చేయాలనే స్ఫూర్తి రగిలించలని అభిప్రాయపడ్డారు. అయ్యా! బాబు! దేహి అనే రోజులు పోయాయి నాన్చుడు ధోరణి కాకుండా చావో రేవో తేల్చుకొనే తెగింపుతో పోరాటం సాగించాలని పేర్కొన్నారు. ప్రతి సమస్యను మాటను ముందుచూపుతో అర్థం చేసుకొని, ప్రజలకు దిశ నిర్దేశం చేస్తాడుకవి, 'ఎల్లప్పుడూ ప్రశ్న కవికి వేటకొడవలి కాకుంటే మనల్ని అప్రమత్తం చేసే కావలి కుక్క' అని కవి తన రచనతో సాయుధుడై పోరాట వారసత్వ పంచడమే కాక పోరాట యోధులను తయారుచేసి అనుక్షణం అప్రమత్తంచేస్తాడు .

*"కవిత్వానికి ముందుమాటలు అవసరం లేదని నా నమ్మకం. పాఠకుడితో కవి జరిపే సంభాషణే కవిత్వం. పాఠకుడికీ కవికీ మధ్య దుబాషీలు అవసరం లేదు. కవి తన అనుభూతులను,అనుభవాలను నేరుగా పాఠకుడితో పంచుకోవడమే మేలు. వాటితో పాఠకుడు సహానుభూతి చెందుతాడు. ఆ అనుభవం నుంచి ముందుమాటలు ఏదో మేరకు పాఠకుడిని దూరం చేస్తాయని నా అభిప్రాయం. అయితే రత్నాకర్ రెడ్డి రాసిన 'వానకోయిల' అనే దీర్ఘ కవితకు కొన్ని మాటలు రాయడానికి నేను అంగీకరించడంలో నా ప్రయోజనం కొంత ఉంది. తెలంగాణ సాహిత్యానికి, తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి ఒక స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం,ఆచరణాత్మక సైద్ధాంతిక భూమిక ఉందని చెప్పడానికి నేను ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకోవడమే ఆ ప్రయోజనం."*(ఆ(రత్నాకర్ రెడ్డి, "వానకోయిల" కవిత్వానికి రాసిన ముందుమాట. కాసుల ప్రతాపరెడ్డి (తెలంగాణ సాహిత్యోద్యమాలు) పుట:96) అని ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ మంచి ముందుమాటను అందించి రత్నాకర్ రెడ్డి కవిత్వానికి సునిశిత విమర్శను అందించారు. ఈ కవి గత రచన ప్రస్తుత రచన వస్తురూపాల్లో దేనికదే సాటిగా అభివర్ణించారు. సమస్త జీవిత పార్శ్వాల్లో రాజకీయాంశ పెనవేసుకొని ఉన్న విషయాన్ని ఈ కవితలు చాటిచెబుతాయిన్నారు. తెలంగాణ భాషను, సామెతలను, నానుడులను, సాంస్కృతిక ఆచరణలను కవి వాడుకొని తీసుకున్న వస్తువుకు, శైలికి మధ్య సమన్వయంకుదిర్చి బలమైన దీర్ఘ కవిత అందించడని పీఠికాకర్త పేర్కొన్నారు. 'తెలంగాణ అస్తిత్వ ఉద్యమం మాత్రమే ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమానికి కార్యాచరణను అందిస్తుందని' పీఠికాకర్త ప్రతిపాదనకి ఈ రచన బలాన్ని మద్దతును ఇచ్చినట్టు పేర్కొన్నారు.

పీఠిక ప్రయోజనం

ఒక గ్రంథ కర్త పీఠిక రాసినపుడు ఆ రచనలో ఉన్న గుణాలనే ప్రస్తుతిస్తాడు. దోషాలను చెప్పడానికి వీలుండదు. తన స్వంత విషయాలు గుణగణాలను చెప్పడమే కన్పిస్తుంది. ఇతరులు పీఠిక రాస్తే ఆరచనను చదివి విషయవిశ్లేషణచేసి, రచనలోని దోషాలను కూడా చెబుతున్న వైనాన్ని మనం గమనించవచ్చు. కవిత్వం బాగుంటే దాన్ని విలువకట్టవచ్చు. బాగాలేకపోతే ఇంకా మంచిగా రాయాల్సింది, ఇలా చెప్పవచ్చు అనే సూచనలు సలహాలకే పరిమితం అవుతాడు కాని కావాలని ఏ మాత్రం బాగాలేదు అని చెప్పే వాళ్ళు తక్కువే అని చెప్పవచ్చు. వీటికి అంతకుముందు వీరికున్న బంధాలను, స్నేహాన్ని బట్టి కూడా ప్రభావితం అవుతుంది. కాని నిష్పాక్షికంగా చెప్పడం లోపాలను ఎంచడం మంచి పీఠిక లక్షణంగా పరిగణించవచ్చు. ఇలాంటి పీఠికలు తెలంగాణ కవిత్వంలో కోకొల్లలు వచ్చాయి. పీఠిక గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పతుంది. రచన నేపథ్యాన్ని తెలుసుకోవడానికి ఉపయోగ పడుతుంది. తెలంగాణ కవిత్వానికి రాసిన పీఠికలలో చాలా భాగం కవి కవిత్వీకరించిన విషయాలుకు మద్దతు ప్రకటిస్తూ, పాఠకులను సంసిద్ధం చేసి సమాయత్తం చేయడమే కనిపిస్తుంది. అదే ఆవేశం, అవే పదాలు అదే ధర్మాగ్రహం అన్ని రచనలలో ప్రతిఫలిస్తుంది.

ఆధారగ్రంథాలు

1. చంద్రశేఖర్ రెడ్డి. డి. "**తెలుగు పీఠిక**" ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాదు, 1990.
2. దేవందర్ అన్నవరం,"**మంకమ్మ తోట లేబర్ అడ్డా**"నూతనసాహితిప్రచురణలు, కరీంనగర్,2005.
3. ప్రతాపరెడ్డి కాసుల,"**తెలంగాణ సాహిత్యోద్యమాలు**"తెలంగాణ ప్రచురణలు, 2015.
4. యాకూబ్. "**తెలంగాణ సాహిత్య విమర్శ**" మాధ్యమం ప్రచురణలు, 2008.
5. వేణుగోపాల్ ఎన్. "**ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర**" విశ్లేషణ ప్రచురణలు,1999.
6. వేణుగోపాల్. ఎన్. "**లేచి నిలిచిన తెలంగాణ**"స్వేచ్ఛా సాహితి హైదరాబాదు,2010.
7. శ్రీధర్ వెల్దండి "**ప్రత్యేకతెలంగాణ ఉద్యమ కవిత్వం**" తెలంగాణ సాహిత్య అకాడమి హైదరాబాదు, 2017
8. సుజాత రెడ్డి, ముదిగంటి,(సం) "**ముద్దెర**" రోహణం పబ్లికేషన్స్, హైదరాబాదు, 2005 .